సాక్షి
ఆదిలాబాద్
శనివారం ♦ 4 ♦ మార్చి ♦ 2023



బెల్టుషాపులకు వేలం!
జిల్లాలో వీడీసీల ఆధ్వర్యంలో బెల్టుషాపుల వేలం యథేచ్ఛగా సాగుతోంది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం గమనార్హం. 8లో



ఘనంగా 'క్రీడా' వార్షికోత్సవం
జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.0 /21.0
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తగ్గనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు దివ్యాంగులకు వైద్యశిబిరం

కైలాస్‌నగర్: జిల్లాలోని అంధులు, బదిరులు, శారీరక దివ్యాంగులకు అవసరమయ్యే సహాయ ఉపకరణాల ఎంపిక కోసం ఈ నెల 4న పట్టణంలోని ప్రభుత్వ గజిటెడ్ నం.1 ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ కాన్పూర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు సదరం సర్టిఫికెట్, ఇటీవల పొందిన ఆదాయ ధ్రువీకరణపత్రం, రేషన్‌కార్డు/ఓటర్‌కార్డు, ఆధార్‌కార్డుతో పాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రొవిజినల్ జాబితా విడుదల

కైలాస్‌నగర్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భర్తీ చేయనున్న మెడికల్ ఆఫీసర్ ఆయుర్వేద, మెడికల్ ఆఫీసర్ హోమియోపతి పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. వివరాలను http://adilabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వివరాలు సరి చూసుకుని, ఎమైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 4నుంచి 9వ తేదీ వరకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉద యం 10.30 నుంచి సాయంత్రం 5గంటలలో పు సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించి సరిచేసుకోవాలని పేర్కొన్నారు. గడువు తరువాత వచ్చిన అభ్యర్థనలు స్వీకరించమని పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబడుతున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్

ఆదిలాబాద్‌రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం చాందా–టి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా మన ఊరు–మన బడి కింద పాఠశాలలో చేపట్టిన పనులు పరిశీలించి అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి ప్రతిరోజు మెనూ ప్రకారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులను సబ్జెక్టులవారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి నారా యణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న అశోక్

కైలాస్‌నగర్: పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధులను చేసేలా ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకోవాలని విద్యాశాఖ స్టేట్ మానిటరింగ్ టీం సభ్యుడు పొరెడ్డి అశోక్, సెక్టోరియల్ అధికారి నర్సయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గజిటెడ్ నంబర్–1 ఉన్నత పాఠశాలలో పదోతరగతి ప్రత్యేక తరగతులను శుక్రవారం వారు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక తరగతులు, స్నాక్స్ అందజేత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులపై ఆరా తీశారు. వారి వెంట హెచ్‌ఎం నీలాదేవి, ఉపాధ్యాయులు గిరి, నంద తదితరులున్నారు.

అడుగంటిన ఆశలు



బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన రైతు తాండ్ర శ్రీనివాస్ తనకున్న నాలుగెకరాల్లో ఈ యాసంగిలో మొక్కజొన్న సాగు చేశాడు. 15 రోజుల క్రితం ఉన్నట్టుండి బోరులో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం ఎకరాకు కూడా నీరందని పరిస్థితి. దీంతో కంకి దశలో ఉన్న చేనంతా ఇలా కళ్లముందే ఎండిపోతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. తన ఆశలన్నీ ఆవిరయ్యాయని కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలా మంది రైతులదీ ఇదే పరిస్థితి.



బుర్కపల్లిలోని బావిలో అడుగంటిన జలం

- జిల్లాలో పడిపోతున్న భూగర్భ జలాలు
- గుడిహత్నూర్‌లో ఒక్క నెలలోనే 8 మీటర్లు డౌన్
- 85 శాతం బోర్లపై తీవ్ర ప్రభావం
- సాగునీరందక ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు

ప్రాజెక్ట్	ప్రస్తుత నీటిమట్టం (టీఎంసీలలో)	పూర్తిస్థాయి నీటిమట్టం (టీఎంసీలలో)
మత్తడివాగు	0.304	0.570
సాత్నాల	0.290	1.240

జిల్లాలో..

వ్యవసాయ బోరుబావులు	26,449
గృహాల బోరు బావులు	9,213
ఓపెన్ బావులు	6,462
చేతి పంపులు	3,688
మొత్తం చెరువులు	458
డెడ్‌స్టోరేజీకి చేరిన చెరువులు	160

బజార్‌హత్నూర్: వేసవి ఇంకా షురూ కాకముందే భానుడు తన ప్రభావం చూపుతున్నాడు. మండుతున్న ఎండలతో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుంది. చెరువులు, బోర్లు, బావులు అడుగంటుతుండడంతో సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. కంకిదశలో ఉన్న జొన్న, మొక్కజొన్నపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితిపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బజార్‌హత్నూర్ మండలంలో ఇప్పటికే మూడు చెరువులు ఎండిపోవడం గమనార్హం. ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

ఆందోళనకరంగా భూగర్భ జలమట్టం..

జిల్లాలో ఊహించని విధంగా భూగర్భ జలాల నీటి మట్టం పడిపోతున్నాయి. గతేడాది మేలో ఉన్న నీటి మట్టం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కనిపిస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఎండలు ముదిరితే మరింత తీవ్ర స్థాయికి చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 90శాతం మెట్ట ప్రాంతం కావడంతో తాగు, సాగునీటి అవసరాలకు భూగర్భ జలాలనే వినియోగిస్తుండటంతో నీటి మట్టం పడిపోవడానికి కారణంగా నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, ఆదిలాబాద్, బోథ్ మండలాల్లో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గుడిహత్నూర్ మండలంలో ఈ జనవరిలో 5.85 మీటర్లుగా ఉన్న నీటి మట్టం ఫిబ్రవరి వరకు 13.20 మీటర్లకు పడిపోవడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో 38 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

భూగర్భ జల వనరుల వినియోగం

జిల్లాలో 90 శాతం మెట్ట ప్రాంతంగా ఉండటం, సాత్నాల, మత్తడివాగు మినహా సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు ఎక్కువగా బోరు బావులపైనే ఆధారపడుతున్నారు. దీంతో భూగర్భ జలాల వినియోగం పెరిగిపోతుంది. గతేడాది జిల్లాలో 52 శాతం భూగర్భ జలాలు వినియోగించినట్లు ఆ శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతంలో భీంపూర్, ఆదిలాబాద్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, మావల, నేరడిగొండ, తాంసి, ఉట్నూర్, తలమడుగు మండలాల్లో భూగర్భ జలాలు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉండగా, తాజా నివేదికలో గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బోథ్ మండలాల్లో సాధారణం కంటే వినియోగం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 26 ప్రాంతాల్లో భూగర్భ జలాలను అంచనా వేయగా, నెల వారీగా ఒక్కోమీటరు చొప్పున తగ్గిపోతున్నట్లు గుర్తించారు. ఏడు మండలాల్లో 10 మీటర్ల కంటే దిగువకు నీటి మట్టం పడిపోగా, మరో 8 మండలాల్లో 6 మీటర్లకు దిగువకు నీటి మట్టం పడిపోవడం కలవరపెడుతోంది.

జిల్లాలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో పలు ప్రాంతాల్లో నమోదైన భూగర్భజలాల మట్టాలు ఇలా.. (మీటర్లలో)

మండలం	జనవరి	ఫిబ్రవరి
ఆదిలాబాద్	8.50	10.15
బజార్‌హత్నూర్	5.40	5.80
బేల(చాంద్‌పల్లి)	8.60	9.85
బోథ్	7.78	9.50
గుడిహత్నూర్	5.85	13.20
భోరజ్(జైనథ్)	12.45	13.90
జైనథ్	2.15	2.90
నేరడిగొండ	9.89	9.85
దేవాపూర్(తలమడుగు)	6.25	7.30
తలమడుగు	4.25	5.70
అర్లి(భీంపూర్)	7.23	8.10
భీంపూర్	5.15	6.93
తాంసి	4.05	4.70
నార్నూర్	3.40	4.63
ఉట్నూర్	4.81	4.90
బేల	5.10	5.75
ఆదిలాబాద్(పిప్పల్‌ధరి)	4.53	4.35
ఆదిలాబాద్ (యాపల్‌గూడ)	7.33	7.60
ఇంద్రవెల్లి(ముత్నూర్)	9.98	12.20
గాదిగూడ	18.73	19.00
గాదిగూడ(అర్జుని)	3.69	5.97
సిరికొండ	7.17	8.10
ఇచ్చోడ	8.46	11.25
ఇచ్చోడ(నర్సపూర్)	4.32	4.96
నేరడిగొండ(కుంటాల)	3.18	4.60
నేరడిగొండ(శంకర్‌పూర్)	5.82	6.73
జిల్లా సగటు	6.70	8.00

నీటిని పొదుపుగా వాడుకుంటేనే మేలు

గతేడాదితో పోల్చితే ఈ సారి భూగర్భ జలాల మట్టం ఎక్కువగా పడిపోయే అవకాశం ఉంది. వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి. భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలి. లేదంటే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్నాయి.

– శ్రీవల్లి, భూగర్భజల శాఖ జిల్లా అధికారి, ఆదిలాబాద్

నాలాల్లో చెత్తవేస్తే జరిమానా

- ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



క్రాంతినగర్‌లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నాలల్లో చెత్తవేసే వారికి జరిమానా తప్పదని కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పష్టం చేశారు. పట్టణంలోని గాంధీనగర్, ఇంద్రానగర్, హమాలివాడ, భాగ్యనగర్, తాటిగూడ కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వేకువజాము నుంచే ఆయా కాలనీలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ తీరు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పట్టణ శివారులోని వైకుంఠధామాన్ని పరిశీలించి పచ్చదనం పెంపునకు మొక్కలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. భాగ్యనగర్‌లోని అర్బన్‌పార్క్, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. చిన్నారులు, వృద్ధులకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశుభ్రతతో వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు.నాలాల్లో మురుగు నీరునిలువ ఉండకుండా ప్రతిరోజు చెత్త, తడి తర వ్యర్థాలను తొలగించాలన్నారు. అందులో చెత్త వేయకుండా గృహ, వ్యాపార సముదాయాల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. అయినా స్పందించని వారికి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. గాంధీనగర్, భాగ్యనగర్ రోడ్లపై మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు అరికట్టేలా వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. హమాలీవాడలోని కమ్యూనిటీ మరుగుదొడ్లను కాలనీవాసులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



జిల్లా కేంద్రంలో శనగ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, తదితరులు



నార్నూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

- అన్నదాతపై కేంద్రం వివక్ష
- ఎమ్మెల్యే జోగు రామన్న
- జిల్లాలో శనగ కొనుగోళ్లు ప్రారంభం

కైలాస్‌నగర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం అన్నదాతపై వివక్ష చూపుతుందని స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న విమర్శించారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన శనగ కొనుగోళ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, మార్క్‌ఫెడ్ డీఎం గౌరీ నాగేశ్వర్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్‌తో కలిసి పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. శనగలను తీసుకువచ్చిన ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వీ గ్రామానికి చెందిన రైతు ముత్తి వెంకటేశ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం నిరంతర ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. అయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాత్రం అదాని, అంబాని, నీరవ్ మోదీవంటి పెట్టుబడిదారులకు దేశసంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ఈ సారి దేశంలో కేసీఆర్ నేతృత్వంలోని కిసాన్ సర్కారు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కుమ్ర విజయలక్ష్మి, మార్కెట్ కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

నార్నూర్: రైతులు దళారులను ఆశ్రయించి పోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట దిగుబడి అమ్మి మద్దతు ధర పొందాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కనకమోతుబాయి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగోరావు, సర్పంచ్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు, సీఈవో గణేశ్, నాయకులు ఫెరోజ్‌ఖాన్, సయ్యద్‌ఖాశీం, రాథోడ్ సుభాష్, రాథోడ్ శివాజీ తదితరులున్నారు.

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోళ్లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోడం వర్ష సునీల్ ప్రారంభించారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్, సహకార సంఘాల చైర్మన్లు బాలచందర్, జితేందర్, నాయకులు గంభీర్, మధుకర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు 'బండి'

- సంజయ్ రాక నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- శ్రేణుల్లో కనిపిస్తున్న జోష్
- భారీగా చేరికలు ఉంటాయంటున్న పార్టీ వర్గాలు
- బల ప్రదర్శనకు సిద్ధమైన నియోజకవర్గ నేతలు
- సంస్థాగత మార్పులపై ఊహాగానాలు

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం జిల్లా కేంద్రానికి విచ్చేయనున్నారు. ఇదివరకు ఆయన జిల్లాకు రెండుసార్లు ఇతర కార్యక్రమాల్లో భాగంగా వచ్చారు. ఈసారి మాత్రం పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు రానుండడమే ఆసక్తి కలిగిస్తుంది. ఏడాదిక్రితం భైంసా అల్లర్ల కేసులో అరెస్టయిన హిందువాహిని కార్యకర్తలను ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉంచినప్పుడు వారిని పరామర్శించేందుకు మొదటిసారి వచ్చారు. నెల క్రితం కేస్లాపూర్ నాగోబా జాతరకు విచ్చేశారు. తాజాగా పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తుండడంతో కార్యకర్తల్లో జోష్ కనిపిస్తుంది. జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీతో పాటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. కాగా పార్టీ పరంగా భారీ ఏర్పాట్లు చేశారు. పట్టణంలో విస్తృతంగా ఫ్లెక్సీలు పెట్టారు.

చేరికలపై ఆసక్తి..

ఇటీవల ఢిల్లీలో కోర్ కమిటీ మీటింగ్‌లో పాల్గొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత బండి సంజయ్ మొదటి జిల్లా సమావేశం ఆదిలాబాద్‌లో నిర్వహిస్తుండటం పార్టీ పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే ఆయన సమక్షంలో భారీగా చేరికలు ఉంటాయని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రధానంగా ఓ సామాజిక వర్గానికి చెందిన నేతలను పార్టీలో చేర్చుకుంటున్నారని చెబుతున్నారు. అందులో అధికార బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వస్తున్న వారు కూడా అధికంగా ఉన్నారని పేర్కొంటున్నారు. కౌన్సిలర్లు, మాజీ జెడ్పీటీసీలు, ఇతర స్థానిక సంస్థల నాయకులు ఇందులో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. కాగా బీఆర్‌ఎస్ నుంచి ఓ యువ నాయకుడు బీజేపీలో చేరుతుండటంపై ప్రచారం సాగుతుంది. అధికార పార్టీ ముఖ్యనేత అల్లుడి తీరుతో విసిగి ఆయన కమలం పార్టీలోకి చేరుతున్నాడని చెబుతున్నారు.

మెప్పు కోసం నియోజకవర్గ నేతల తాపత్రయం..

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జిల్లాకు రానుండగా నియోజవర్గాల్లో టికెట్ ఆశిస్తున్న పార్టీ నేతలు ఆయన మెప్పు కోసం తాపత్రయ పడుతున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ నుంచి మరోసారి తన అభ్యర్థిత్వంపై పాయల్ శంకర్ గట్టి నమ్మకంతో కదులుతున్నారు. ఈసారి కూడా తనకే టికెట్ వస్తుందని శ్రేణుల వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ విస్తృతంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్న సుహాసిని రెడ్డి కూడా ఈసారి టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల ఆదివాసీ గూడేల్లో సరైన సదుపాయాలు లేవని ఆమె నిర్వహించిన పాదయాత్రకు భారీ స్పందన లభించడంతో ఆమె ఉత్సాహంగా ఉన్నారు. దీనికి స్పందించి ఆయా గూడేల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతో ఇంకా ఉత్సాహంగా కదులుతున్నారు. ఇక ఎన్‌ఆర్‌ఐగా ఉండి స్వస్థలానికి తిరిగి వచ్చిన కంది శ్రీనివాస్ రెడ్డి పార్టీలో చేరిన తర్వాత వివిధ కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నారు. పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే శ్రేణులను కలుస్తున్నారు. ఇదిలా ఉంటే బోథ్ నియోజకవర్గంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె మానాజీ, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు అధ్యాపక వృత్తిలో ఉన్న బలరాం జాదవ్ కూడా అవకాశం ఇస్తే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చుతూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. కాగా శనివారం జరిగే మీటింగ్‌కు ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలు కూడా హాజరు కానున్నారు. ఏదేమైనా సంజయ్ టూర్ పార్టీలో ఆసక్తి కలిగిస్తుంది.



కేస్లాపూర్ నాగోబా జాతరలో తలపాగతో బండి సంజయ్ (ఫైల్)

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

- మూడోరోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- జిల్లాకేంద్రంలో ర్యాలీ, మానవహారం



కలెక్టరేట్ చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎదులాపురం: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె మూడో రోజుకు చేరింది. శుక్రవారం వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టి అనంతరం కలెక్టర్ చౌక్ వద్ద మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను, ఎన్‌ఈపీ, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.5 లక్షలు, హెల్పర్లకు రూ.3 లక్షలు అందించాలని, మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా గుర్తించాలని, ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో యూనియన్ కోశాధికారి రత్నమాల, నాయకురాళ్లు పంచపుల, సునీత, పార్వతి, పంచశీల, మధునిక, ఖుష్‌వర్త, నర్మద, భారత,అంగన్‌వాడీలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల నడ్డివిరుస్తున్న కేంద్రం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- గ్యాస్ ధర పెంపుపై బీఆర్‌ఎస్ నిరసన

కైలాస్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచుతూ పేదల నడ్డి విరుస్తుందని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న విమర్శించారు. వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఎన్టీఆర్‌చౌక్‌లో కట్టెల పొయ్యిపై వంట చేసి కేంద్రం తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌తో పాటు నిత్యావసరాల ధరలు చుక్కలనంటాయన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కేంద్రానికి సామాన్యులపై ఏమాత్రం ప్రేమున్న పెంచిన ధరలు వెంటనే తగ్గించాలన్నారు. లేకుంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం రోడ్డుపైనే భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అలాల్ అజయ్, అష్రఫ్, ఫ్లోర్ లీడర్ సతీష్, నాయకులు ప్రేమల, వేణుగోపాల్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే రామన్న, తదితరులు

క్లుప్తంగా

ఆర్కే 6 గనిని సందర్శించిన ఆదిలాబాద్ జడ్జి



గనిపై అధికారులతో జడ్జి ప్రమీల జైన్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆదిలాబాద్ సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల జైన్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆర్కే 6 గనిని సందర్శించారు. గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బెల్లంపల్లి రీజియన్ లా ఆఫీసర్ ప్రభందిత, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి, సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, పిట్ ఇంజినీర్ శ్యాంకుమార్, సంక్షేమాధికారి సునీల్‌కుమార్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


గుడుంబా తయారీ సామగ్రితో సిబ్బంది

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ తాండ, అంబారిపేట్ శివారులోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని వంద లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం నిందితులు భూక్యా సుమలత, ఎనగందుల లక్ష్మి, చీమల లక్ష్మిలను ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రవికుమార్, సిబ్బంది రశీద్, నరేందర్, గౌతం, వెంకటేశ్, నిరోషా ఉన్నారు.

రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తు తెలియని రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం తక్కళ్లపల్లికి చెందిన తన్నీరు అశోక్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లిన అశోక్ తక్కళ్లపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతుని కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ కారణంగానే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక మరేదైనా కారణమా? అనేది దర్యాప్తులో తేలనుందన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

భీమారం(చెన్నూర్): అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. ముందునుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఇసుక టిప్పర్ కిందపడి మృతి చెందిన సంఘటన మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గట్ల సుధాకర్ తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన సూరం మహేశ్ (30) ద్విచక్ర వాహనంపై చెన్నూర్ మండలం ఎలక్కపేటలోని తన అత్తగారింటికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై కుందారం ఎక్స్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టి దాని ముందునుంచి వెళ్తున్న ఇసుక టిప్పర్ కిందపడ్డాడు.

బెల్ట్‌షాపులకు వేలం.!


కౌర గ్రామంలోని ఓ బెల్టుషాపు

- వీడీసీ ఆధ్వర్యంలో తతంగం
- గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు
- సంసారాల్లో చిచ్చుపెడుతున్న మద్యం
- గ్రామాభివృద్ధి కమిటీల తీరుపై మహిళల మండిపాటు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బోథ్: గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీ) అభివృద్ధి పేరుతో బెల్ట్‌షాపుల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ప్రజలను మద్యానికి బానిసలు చేస్తున్నాయి. గ్రామాల అభ్యున్నతికి పాటు పడాల్సిన వీడీసీలు అందుకు మద్యంపై ఆదాయానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. బెల్ట్‌షాపులకు ఎలాంటి అనుమతులు లేకున్నా వాటి నిర్వహనకు ఏకంగా బహిరంగంగా టెండర్లు వేసి మరీ గ్రామాల్లో అనధికార లైసెన్స్‌లు జారీ చేయడంపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో బెల్ట్‌షాపు దక్కించుకున్న నిర్వాహకులు ఇష్టానుసారంగా ధరలు పెంచి మద్యం విక్రయిస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ధరలు...

ఇక బెల్టుషాపుల్లో మద్యాన్ని వారికి ఇష్టమైన ధరలకు విక్రయిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కువగా చీప్‌లిక్కర్, బీర్లు మాత్రమే అమ్ముడుపోతాయి. కూలీనాలీ చేసే సామాన్య జనాలు అధికంగా చీప్‌లిక్కర్లకు అలవాటుపడుతుంటారు. మద్యం వ్యసనాన్ని అవకాశంగా తీసుకున్న బెల్టుషాపు నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.15 నుంచి 20 వరకు అదనంగా తీసుకుంటున్నారు. రూ.100కు విక్రయించాల్సిన బాటిల్‌పై రూ.120 వరకు తీసుకుంటున్నారు. బీర్లపై కూడా ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 తీసుకుంటున్నారు.

వీడీసీ ద్వారా వేలం..

- మండలంలోని కసుగుట్ట, మర్లపెల్లి, కౌఠ, ధన్నూర్‌తో పాటు అనేక గ్రామాల్లో బెల్టు షాపులకు వేలం వేశారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50 వరకు బెల్టు షాపులు ఉన్నాయి.
- గుడిహత్నూర్ మండలంలో సీతాగొంది, తోషం, ముత్నూర్, ఉట్నూర్ ఎక్స్‌రోడ్డుతో పాటు దాదాపు 30గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఉన్నాయి.
- నేరడిగొండ మండలంలో విడిసి ఆధ్వర్యంలో నేరడిగొండ మండల కేంద్రంలో మూడు, వడూర్‌లో ఒకటి, కుమారిలో ఒకటి, తేజాపూర్, కుప్టి, తర్నం కె, బుగ్గారాం, బిసావర్గాంతో పాటు పలు గ్రామాల్లో 30 మొత్తం బెల్టు షాపులు ఉన్నాయి.

కాపురాల్లో మద్యం చిచ్చు

గ్రామాల్లో పలువురు మద్యానికి బానిసై సంసారాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. పనులకు వెళ్లకుండా మద్యం మత్తులో మునిగితేలుతున్నారు. భార్య పని చేస్తే ఆ డబ్బులను తాగుడుకు తగిలేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో చదువుకోవాల్సిన చిన్నారులు సైతం ఇంటి పెద్ద మద్యానికి బానిస కావడంతో పనిబాట పడుతున్నారు. యువత సైతం మద్యానికి అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

బెల్ట్ షాపులను మూసివేయాలి



చాలా గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉన్నాయి. వీడీసీ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి మరీ బెల్ట్ షాపులకు అనుమతులు ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలి. మద్యం బారిన పడకుండా యువకులను, పేద, మధ్య తరగతి కుటుంబాలను రక్షించాలి.

– సుమేర్ పాషా, బోథ్

ముగిసిన సిరిచెల్మ మల్లన్న జాతర



ఇచ్చోడ: వారం రోజుల పాటు సాగిన సిరిచెల్మ మల్లన్న జాతర శుక్రవారం ముగిసింది. తెలవారుజామున నాలుగు గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం నుంచి భక్తులు నడుస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అవరణలో రథోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

నాడు వెలవెల- నేడు జలకళ


నాడు చెన్న చెరువు నుండి మెదరి చెరువుకు నీళ్లు వెళ్లే కాలువ


నేడు నిండుగా పారుతున్న కాలువ

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామంలోని నాలుగు చెరువుల్లో నీళ్లు లేకపోవడంతో రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశం ఉండడంతో ఫిబ్రవరి 19న సమస్యపై 'సాక్షి'లో 'గొలుసుకట్టు తడారుతోంది' శీర్షికన కథనం ప్రచురించాం. ఈ కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు సరసర్వతి కాలువ ద్వారా వడ్యాల్ వద్ద వాగులోకి నీటిని వదలారు. అక్కడ నుంచి లక్ష్మణచాంద మాటు కాలువ ద్వారా నీటిని ఫిబ్రవరి 19 నుంచి నేటి వరకు వదులుతున్నారు. దీంతో మండలంలోని అతి పెద్ద చెరువుల్లో ఒకటైన చింతల్‌చాంద చెరువు నిండు కుండలా మారింది. గురువారం నుంచి చెన్న చెరువు నుండి నీటిని మెదరి చెరువులోకి వీడీసీ సభ్యులు వదిలారు. మెదరి చెరువు నిండగానే అక్కడ నుంచి కొర్లకుంట, దాని నుంచి ఊర చెరువు నింపుకుంటామని వీడీసీ సభ్యులు తెలిపారు.


నాడు నీళ్లు లేక చెన్న చెరువు


నేడు నిండుకుండలా చెన్న చెరువు

అడవులను సంరక్షించాలి


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్

ఇచ్చోడ: అడవుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని టైగర్ జోన్ అటవీ అధికారి వాహబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి కేశవపట్నం గ్రామంలో అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అడవుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రెంజ్ ఆధికారి అమర్ సింగ్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు, కాలిపోయిన సామగ్రి



ఇంద్రవెల్లి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం మండలంలోని దనోర బి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ వివరాల ప్రకారం.. దనోర (బి) గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతితో పాటు కుటుంబ సభ్యులు ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఫ్రిజ్, మంచాలు, కూలర్, టీవీ, బియ్యం, గోధుమలు, జొన్నలు తదితర వస్తువులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టం వివరాలు సేకరించారు. గ్రామస్తులతో కలిసి పంచనామా నిర్వహించి రూ.88వేల600 నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ఇందులో సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలి


విద్యార్థినితో చదివిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి


మధ్యాహ్న భోజనం స్వయంగా రుచి చూస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

లక్ష్మణచాంద: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానంలో నిలవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈవో రవీందర్ రెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించారు. మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తయ్యాయని, ఉన్నత పాఠశాలలోని పనులు త్వరగా పూర్తిచేసి రంగులు వేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి రుచిచూశారు. మధ్యాహ్న భోజనం తయారీకి నాణ్యమైన సరుకులు ఉపయోగించాలని తెలిపారు. సరుకులను పరిశుభ్రమైన ప్రదేశంలో నిల్వ ఉంచాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులలో సాయంత్రం మెనూ ప్రకారం స్నాక్స్ అందించాలన్నారు. తర్వాత పదో తరగతికి వెళ్లి విషయ అవగాహనను పరిశీలించడానికి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ప్రభుత్వం అందించిన అభ్యసన దీపికలను చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో ఉషారాణి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సాకెరలో ఆకస్మిక పర్యటన


సాకెరలో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

సోన్ మండలం సాకెర గ్రామంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. పల్లెప్రగతి, బృహత్ పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠధామం, నర్సరీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ట్రాలీ, ట్యాంకర్ ఏర్పాటుతో పచ్చదనం పారిశుధ్య నిర్వహణను పగడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్ట్ షెడ్‌లలో సేంద్రియ ఎరువు తాయారు చేయాలని సూచించారు.

శనగ పంట దగ్ధం

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన ముండే ధోండీరాం ఐదెకరాల్లో సాగు చేసిన శనగ పంటను కోత కోసి, కుప్పగా పేర్చి ట్రిల్లర్లో పంట తీసుకోవడానికి వేచి ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనగపంట కుప్పకు నిప్పు పెట్టడంతో సుమారు 40క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో రైతు బోరున విలపించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండునెలల జైలు

దండేపల్లి(మంచిర్యాల): ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి కోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మండలంలోని చింతపల్లికి చెందిన ఎంబడి శంకరయ్య 2017 సెప్టెంబర్ 17న బైక్‌పై వెళ్తూ ఇదే మండలంలోని కొళ్లపెల్లికి చెందిన బొక్కనపెల్లి సాయికుమార్‌ను ఢీకొట్టాడు. ఘటనలో సాయికుమార్ మృతి చెందాడు. దీంతో శంకరయ్యపై దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకాగా రిమాండ్‌కు తరలించారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గతనెల 22న మహారాష్ట్రకు రెండు కార్లల్లో ఎనిమిది మంది కలిసి గంజాయి తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. పరారైన వ్యక్తుల్లో ఒకరు మెడెశెట్టి మహేష్‌ను శుక్రవారం రాంనగర్‌లో అరెస్టు చేశారు.

ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ


ప్రశంసాపత్రం అందుకుంటున్న నరేష్ కుమార్ (గొల్లమాడ పంచాయతీ కార్యదర్శి)


ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజు (తురాటి పంచాయతీ కార్యదర్శి)

నర్సాపూర్(జి): గ్రామాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (టీఎస్ఐఆర్డీ)లో పంచాయతీ కార్యదర్శులకు ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3 వరకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ ముగిసింది. జిల్లా నుంచి నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ, తురాటి, దిలావర్‌పూర్ మండలం నుంచి మాడేగాం పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరయ్యారు. నరేశ్‌కుమార్, రాజు, సునీల్‌కుమార్ శిక్షణలో పాల్గొని ఫీల్డ్ విజిట్‌లో భాగంగా శంషాబాద్ మండలం కవాగూడ గ్రామ పంచాయతీని సందర్శించారు. శిక్షణ అనంతరం ప్రశంసా పత్రాలు అందుకున్నారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న సునీల్ కుమార్ (మాడేగాం పంచాయతీ కార్యదర్శి)

బాధ్యులపై చర్య తీసుకోవాలి


కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: స్థల వివాదంలో దంపతుల ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దుకాణాలు మూసి వేశారు. దంపతుల ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు పెద్ద ఎత్తున జిల్లా ఆసుపత్రికి తరలివచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో, డీఎస్పీకి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి గ్రామంలో విద్యుదాఘాతంతో కొకాటే జనార్దన్‌కు చెందిన ఇల్లు, కిరాణకొట్టు దగ్ధమైంది. ఎస్సై సయ్యద్ ముజాయిద్ వివరాల ప్రకారం... కొలారి గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీ గాలిదుమారంతో విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి తగిలి నిప్పురవ్వలు జనార్దన్ ఇంటిపై పడడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ఒంటరిజీవితం భరించలేక ఆత్మహత్య

భైంసాటౌన్: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఒంటరి జీవితం భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భైంసాలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ఉమ్రి తాలూకా జిరోల గ్రామానికి చెందిన దొమ్మలవార్ దత్త(31)కు భైంసాకు చెందిన సక్కుబాయితో వివాహమైంది. కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి భార్యతో గొడవ పడుతుండడంతో పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో దత్త శుక్రవారం భైంసాకు చేరుకుని పురుగుల మందు తాగి ఏరియాస్పత్రి వద్దకు వచ్చి పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కుక్క దాడి

భైంసా: బీఆర్ఎస్ బాసర మండల సీనియర్ నాయకుడు విశ్వనాథ్‌పటేల్‌పై గురువారం రాత్రి కుక్క దాడి చేసి గాయపర్చింది. అతడు రాత్రి ఇంటి వద్ద నిల్చుని ఉండగా వెనుక నుంచి ఒకసారిగా దాడిచేసి గాయపరిచింది. కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇటీవల మండల కేంద్రంలో లేగదూడతో పాటు ట్రిపుల్ ఐటీ విద్యార్థులపై కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.